క్లుప్తంగా

రోగులకు మామిడి పండ్లు పంపిణీ

ఎలిగేడు: లాలపల్లి గ్రామానికి చెందిన అమరగొండ గంగయ్య తన తోటలో కాసిన మామిడి పండ్లను సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిన రోగులకు తన మనవడి ద్వారా పంపిణీ చేశారు. గంగయ్య రోగులకు మామిడి కాయలను అందజేయడం ఆయన సేవకు గొప్ప నిదర్శనమని మెడికల్ ఆఫీసర్ నిస్సీక్రిస్టీనా అన్నారు.

కళాకారులకు చేయూత

జూలపల్లి: వడ్కాపూర్లో మూడు రోజులుగా ప్రదర్శిస్తున్న చిరుత రామాయణం కళాకారులకు పలువురు ఆర్థికంగా చేయూతనిస్తున్నారు. కాల్వశ్రీరాంపూర్ మాజీ జెడ్పీటీసీ సారయ్యగౌడ్ రూ.5వేల ఆర్థిక సాయం, అబ్బాపూర్ ఎంపీటీసీ సభ్యుడు దండె వెంకటేశం రూ.1,000 పంపించగా.. బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు జెట్టి సతీష్ కళాకారులకు అందజేశారు. నాయకులు బల్ల సత్తయ్య, ఆంతయ్య, కనకట్ల కనకయ్య, దావర్త రాజయ్య, మార్క సత్తయ్య, ఆకుల కుమార్, కనికిరెడ్డి సంపత్ తదితరులున్నారు.

నిబంధనల మేరకు పనులు చేయాలి

జూలపల్లి: గ్రామాల్లో చేపట్టిన ఉపాధిహామీ పనుల్లో నిబంధనలు పాటించాలని ఏపీవో సదానందం సూచించారు. చీమలపేట గ్రామ సమీపంలోని రామప్పబోరుకు 160 మంది ఉపాధిహామీ కూలీలు తవ్వుతున్న కాంటూరు కందకాలను పరిశీలించారు. పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎఫ్ఏ, మేట్లున్నారు.

నూతన వేతనాలు అమలు చేయాలి

రామగుండం: దక్షిణ మధ్య రైల్వే రామగుండం కాంట్రాక్టు కార్మికులకు ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి పెరిగిన వీడీఏ ప్రకారం వేతనాలు అమలు చేయించాలని, వీరితోపాటు కోల్ వ్యాగిన్ క్లీనింగ్ కార్మికులకు సైతం కనీస వేతనం అమలు చేయాలని కోరుతూ సోమవారం రైల్వే డిపో సీడీఎంఈ, రైల్వే కమర్షియల్ ఇన్స్పెక్టర్కు రైల్వే కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు లిఖితపూర్వకంగా వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి ఎం.రామాచారి, రైల్వే కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బొంకూరి మహేశ్ తదితరులున్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం



పాలకుర్తి: పుట్నూర్ గ్రామంలోని శ్రీగంగమాత ఆలయంలో సోమవారం మాస శివరాత్రిని పురస్కరించుకొని గంగపుత్ర కులస్తుల ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ పూజారి కొండపర్తి సత్యనారాయణాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విగ్రహ దాతలు కొండ సరోజన-రాజయ్య దంపతులు పాల్గొని పూజలు చేశారు. అన్నదానం చేశారు. బింగి వెంకటి, రమేశ్, బోరె గట్టయ్య, పల్లికొండ తిరుపతి, మల్లేష్, నరేష్, రాజయ్య, కొమురయ్య పాల్గొన్నారు.

రుద్రాభిషేకం

సుల్తానాబాద్: పట్టణంలోని శివాలయంలో సోమవారం 101 రకాల పండ్లతో స్వామివారికి రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. మాస శివరాత్రి సందర్భంగా వెంగళ సత్యనారాయణ-స్వర్ణలత, కొమురవెల్లి ప్రసాద్-అన్నపూర్ణ, తౌడుపూరు సురేష్-హరిత దంపతులు అభిషేకం చేశారు.

అమృత కలశాల పంపిణీ

కమాన్పూర్: మండలంలోని పలు నిరుపేద కుటుంబాలకు సదాశాయ ఫౌండేషన్, కమాన్పూర్ లయన్స్ క్లబ్, సాయి భక్తుల ఆధ్వర్యంలో సోమవారం బియ్యంతోపాటు 18 రకాల నిత్యావసర సరుకుల(అమృత కలశాలు)ను పంపిణీ చేశారు. సానా రామకృష్ణారెడ్డి, నల్లవెల్లి శంకర్, మోహన్, చారి, దేవారెడ్డి, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ఎఫ్సీఐ క్రాస్ రోడ్లోని ఆటో స్టాండ్ వద్ద శతాబ్ది లయన్స్ క్లబ్ మొబైల్ వ్యాన్ ద్వారా సోమవారం కంకణాల ముకుందరెడ్డి, శ్రీదేవి దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా అన్నదానం చేశారు. కార్పొరేటర్ రమణారెడ్డి, స్వామిగౌడ్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ధర్మపురి నియోజకవర్గ ఇన్చార్జిగా రాంబాబు

ధర్మారం: బీజేపీ ధర్మపురి నియోజకవర్గ ఇన్చార్జిగా కొత్తపేట గ్రామ మాజీ సర్పంచ్ కొమ్ము రాంబాబును నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు మోరపల్లి సత్యానారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. నియామక పత్రాన్ని అందించిన తర్వాత రాంబాబును శాలువాతో సత్కరించారు. కన్నం అంజయ్య, మెడవేని శ్రీనివాస్, సందనవేని లక్ష్మణ్, తీగుళ్ళ సతీష్రెడ్డి, కొక్కుల బాలకృష్ణ పాల్గొన్నారు.

ప్రమాదాల రహదారి..



రహదారిని పరిశీలిస్తున్న ఎస్సై చంద్రశేఖర్(ఫైల్)



కుంగిపోయి ప్రమాదకరంగా మారిన రహదారి

- కుంగిన రోడ్డు
- నాసిరకం పనులే కారణమంటున్న ప్రజలు
- పరిశీలించిన పోలీసులు

కమాన్పూర్: ఆ రహదారిపై వాహనదారులు ప్రయాణించాలంటేనే జంకుతున్నారు. అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. నాసిరకం పనులతో రహదారి రెండు పక్కలా అరఫీటు మేర కుంగి పూర్తిగా పగులుచూపి ప్రమాదకరంగా మారింది. ప్రతిరోజు ఇక్కడ వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురువుతున్నారు. మంథని–పెద్దపల్లి ప్రధాన రహదారి నుంచి పోలీస్స్టేషన్, మండల కేంద్రానికి వెళ్లే పాత రహదారిని కొన్నేళ్ల క్రితం డబుల్ రోడ్డుగా మార్చడానికి నిధులు మంజూరు చేయడంతో.. పనులు చేపట్టారు. గతంలో ఇక్కడ రహదారి చెడిపోవడంతో సీసీ రోడ్డు వేశారు. డబుల్ రోడ్డు పనులు చేపట్టిన సమయంలో సీసీ రోడ్డును తొలగించకుండానే ఇరుపక్కలా మట్టిని తొలగించి తారు రోడ్డు వేశారు.

అదుపు తప్పుతున్నారు..

రహదారికి ఇరుపక్కలా అరఫీటు మేర తారు రోడ్డు కుంగిపోవడంతోపాటు రోడ్డు మధ్య భారీ పగుళ్లు చూపడంతో.. రాత్రివేళ దారిపై వెళ్లే వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటివరకు ఇక్కడ వాహనాలు అదుపు తప్పి వంద మంది వరకు ప్రమాదాలకు గురైనట్లు స్థానికులు తెలుపుతున్నారు. కొద్ది నెలల క్రితం ఓ పోలీస్, రెవెన్యూ అధికారుల వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలకు గురైనా.. పట్టించుకునే వారే కరువయ్యారని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. పనులను కాంట్రాక్టర్ నాసిరకంగా చేపట్టడంతో అనతి కాలంలోనే రహదారి కుంగిపోతూ పగుళ్లు చూపి ప్రమాదాలకు గురవుతున్నట్లు వాహనదారులు అంటున్నారు. కుంగిన రహదారిపై ఆదివారం రాత్రి రెండు వాహనాలు అదుపుతప్పి పడిపోవడంతో నలుగురికి గాయాలయ్యాయి. రహదారిని సోమవారం కమాన్పూర్ ఎస్సై చంద్రశేఖర్ పరిశీలించారు.

మరమ్మతు చేయిస్తాం

మంథని–పెద్దపల్లి ప్రధాన రహదారి నుంచి కమాన్పూర్ పోలీస్స్టేషన్కు వెళ్లే ప్రధాన రహదారిపై కుంగిపోయి వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయని మా దృష్టికి వచ్చింది. రహదారిని పరిశీలించి మరమ్మతు చేయిస్తాం.

– రాములు, ఆర్అండ్బీ డీఈ, పెద్దపల్లి

ప్రతిరోజూ..



మా ఇంటి ముందున్న రహదారిపై ప్రతిరోజు ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి పడిపోతున్నారు. వాహనాల ధ్వని విని బయటికి వచ్చి చూస్తే వాహనదారులు రోడ్డుపై పడిపోయి కన్పిస్తున్నారు. ప్రమాదంలో గాయపడిన వారి వివరాలు తెలుసుకొని వారి కుటుంబ సభ్యులకు సమాచారమందించడంతో.. వచ్చి తీసుకెళ్తున్నారు.

– లక్ష్మణ్, స్థానికుడు

లైటింగ్ ఏర్పాటు చేయాలి



మండల కేంద్రానికి వెళ్లే రహదారి రెండు పక్కలా కుంగిపోవడంతోపాటు పగుళ్లు చూపడంతో.. చీకట్లో వెళ్లే ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రహదారి వెంట లైటింగ్ ఏర్పాటు చేసి రహదారి మరమ్మతులు చేపట్టాలి.

– శంకర్, కమాన్పూర్

అధికారుల దృష్టికి తీసుకెళ్లా



రహదారిని పరిశీలించా. ప్రమాదాలపై ఆర్అండ్బీ అధికారుల దృష్టికి తీసుకెళ్లా. రహదారిని పరిశీలించి మరమ్మతు చేపడతామన్నారు.

– చంద్రశేఖర్, ఎస్సై, కమాన్పూర్

మండుటెండల్లో.. ప్రచార సభకు..



పెద్దపల్లిరూరల్: మండుతున్న ఎండను లెక్క చేయకుండా ట్రాలీ ఆటో, ట్రాక్టర్ ట్రాలీ, డీసీఎం వ్యాన్లలో పల్లె ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో మహిళలు తరలివచ్చారు. పెద్దపల్లిలో సోమవారం జరిగిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా హాజరైన సభను విజయవంతం చేసేందుకు స్థానిక నేతలు తంటాలు పడ్డారు. మహిళలంతా తలకు బట్ట కట్టుకొని ట్రాలీలో కూర్చొని ఎండలోనే ప్రయాణం సాగించారు.

కొప్పుల ఈశ్వర్ను గెలిపించాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మనోహర్రెడ్డి

పెద్దపల్లిరూరల్: ఈనెల 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్కు అండగా నిలిచి గెలిపించుకుందామని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్రెడ్డి అన్నారు. రాఘవాపూర్, దేవునిపల్లి, సబ్బితం గ్రామాల్లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధి కూలీల వద్దకు వెళ్లి కాంగ్రెస్ పాలకుల మోసాలను గుర్తించి గట్టి బుద్ధి చెప్పాలన్నారు. మండల అధ్యక్షుడు మర్కు లక్ష్మణ్, రాములు, చుంచు సదయ్య, రామస్వామి, కిషన్, తాడిచెట్టి శ్రీకాంత్, బొడ్డు చంద్రయ్య, సందీప్, సుధాకర్, రాజేశం, అంజిబాబు, నారాయణ తదితరులున్నారు.

ముత్తారం: కాంగ్రెస్ మాటలను నమ్మి మోసపోవద్దని పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ పేర్కొన్నారు. సోమవారం రాత్రి ఓడేడ్లో ఎన్నికల ప్రచారం చేశారు. పెద్దపల్లి ఎంపీ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ను గెలిపించాలని కోరారు. ఎంపీపీ జక్కుల ముత్తయ్యపటేల్, మండల అధ్యక్షుడు కిషన్రెడ్డి, మాజీ మండల సర్పంచుల కన్వీనర్ నూనె కుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జూలపల్లి: కాంగ్రెస్ అబద్ధపు పునాదుల మీద అధికారంలోకి వచ్చిందని, రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు రఘువీర్సింగ్ అన్నారు. నాగులపల్లెలో పెద్దపల్లి పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ను గెలిపించాలని ఉపాధిహామీ పని స్థలం వద్ద కూలీలతో సమావేశం నిర్వహించారు. కంది చొక్కారెడ్డి, లక్కాకుల శ్రీనివాస్, మల్లారపు అంజయ్య, గొంటి శ్రీనివాస్, గండు సత్యనారాయణ, కనకయ్య, రాజేశం, ప్రవీణ్, వినయ్ తదితరులున్నారు.

కాల్వశ్రీరాంపూర్: కొప్పుల ఈశ్వర్కు ఓటేసి గెలిపించాలని ఎంపీపీ నూనేటి సంపత్ హమాలీలను కోరారు. పందిల్ల గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సిలారపు మల్లయ్య, బండ రవీందర్రెడ్డి, కుమార్యాదవ్, ఓదెల రవి పాల్గొన్నారు.

సుల్తానాబాద్రూరల్: కొప్పుల ఈశ్వర్ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎంపీపీ బాలాజీరావు కోరారు. గొల్లపల్లి, సాంబయ్యపల్లి, నారాయణారావుపల్లి గ్రామాల్లో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. నాయకులు సందీప్రావు, రాజమల్లయ్య, అంజయ్యగౌడ్, తాళ్లపల్లి మనోజ్గౌడ్ తదితరులున్నారు.

బీజేపీ అభ్యర్థిని గెలిపించండి



రాజాపూర్లో బీజేపీ నాయకుల ప్రచారం



ముత్తారంలో ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

రామగిరి: పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ను గెలిపించాలని మండల అధ్యక్షుడు ముల్మూరి శ్రీనివాస్ కోరారు. రాజాపూర్ గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధిహామీ కూలీల వద్దకు వెళ్లి ఓటు అభ్యర్థించారు. మాటేడి రాజబాబు, తీగల శ్రీధర్, దొంతుల సురేష్ పాల్గొన్నారు.

ముత్తారం: ముత్తారంలో బీజేపీ నాయకులు ఎన్నికల ప్రచారం చేపట్టారు. పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ను గెలిపించాలని ఓటర్లను కోరారు. ఉపాధిహామీ కూలీల వద్దకు వెళ్లి బీజేపీకి ఓటేయాలని కోరారు. మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. నాగినేని జగదీశ్వర్రావు, పెయ్యల కుమార్, దేవునూరి కొంరయ్య, పిట్టల రాయమల్లు, మల్లయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మంథని: ప్రజలకు ఉచిత హామీల ఆశ చూపి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆ మాటను విస్మరించిన విషయాన్ని ప్రజలకు వివరించాలని పార్లమెంట్ ప్రభారి నరేందర్రెడ్డి, సహ ప్రభారి రమేశ్ అన్నారు. సోమవారం మంథనిలోని పార్టీ కార్యాలయంలో పార్లమెంట్ కోఆర్డినేటర్ సుహాసిని, జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ వెంకటేశ్తో కల్సి విలేకరులతో మాట్లాడారు. దేశాన్ని కాపాడుతున్న నరేంద్రుడిని గెలిపించాలన్నారు. బీజేపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ను గెలిపించే బాధ్యత మీదేనని అన్నారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కొండపాక సత్యప్రకాష్, కాటారం సింగిల్ విండో చైర్మన్ నారాయణరెడ్డి తదితరులున్నారు.

కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలి

- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్బాబు



సుల్తానాబాద్లో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్బాబు



పాలకుర్తి గ్రామ చెరువులో కూలీలతో కలిసి పనులు చేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్సింగ్

సుల్తానాబాద్: దేశంలో మోదీ గ్యారంటీతో ముందుకు వెళ్తున్నారా.. బీజేపీ గ్యారంటీలా అని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్బాబు ప్రశ్నించారు. సుల్తానాబాద్లో సోమవారం రాత్రి పూసాల రోడ్డులో కార్నర్ మీటింగ్లో పెద్దపల్లి, చెన్నూరు ఎమ్మెల్యేలు చింతకుంట విజయరమణారావు, వివేక్ వెంకటస్వామిలతో కలిసి మాట్లాడారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా పెద్దపల్లిలో కుటుంబ పాలనలను అంతమొందించాలని మాట్లాడుతున్నారని, బీజేపీలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్షా ఇద్దరి షోలే కనబడుతున్నాయని, బీజేపీలో ప్రజాస్వామ్యం ఉందా అని ప్రశ్నించారు. పదవిపై వ్యామోహం లేకుంటే ప్రధాన మంత్రి మరొకరికి అవకాశం ఎందుకివ్వడం లేదన్నారు. అన్నివిధాలా రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి కావడానికి అవకాశముందని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని కోరారు. పెద్దపల్లి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ.. పార్లమెంట్లో ప్రశ్నించే గొంతునవుతానని అన్నారు. మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ తదితరులు పాల్గొన్నారు

పాలకుర్తి: రామగుండం ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ఠాకూర్ పాలకుర్తి మండల కేంద్రంతోపాటు బసంత్నగర్లో ఉపాధిహామీ పనులు నిర్వహిస్తున్న కూలీల వద్దకు వెళ్లి పార్లమెంట్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ఓదెల: పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు కొలనూర్, గోపరపల్లె గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు.

కాల్వశ్రీరాంపూర్: పెగడపల్లి, కూనారం గ్రామాల్లో ఎమ్మెల్యే విజయరమణారావు ప్రచారం చేశారు.

మంథని: కాంగ్రెస్ నాయకులు గోపాల్పూర్, చిన్న ఓదాలల్లో వంశీకి మద్దతుగా ప్రచారం నిర్వహించారు.

సంక్షిప్త వార్తలు

పోలింగ్ కేంద్రాల వద్ద పారిశుధ్య పనులు

సుల్తానాబాద్: ఈనెల 13న నిర్వహించే ఎన్నికల సందర్భంగా పోలింగ్ బూత్ల వద్ద కార్మికులతో శుభ్రం చేయించినట్లు మున్సిపల్ కమిషనర్ వేణుమాధవ్ సోమవారం తెలిపారు. సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలో ఉన్న పూసాల, శాస్త్రినగర్, సుగ్లాంపల్లి బూత్ల వద్ద శుభ్రం చేయించారు.

10 లోగా పనులు పూర్తి చేయాలి

రామగుండం: ఈనెల 10 లోగా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామ సంఘాల ప్రతినిధులను ఆదేశించిన నేపథ్యంలో సోమవారం వివిధ గ్రామాల్లో అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఐకేపీ ఏపీఎం నర్సమ్మ గ్రామ సంఘాల ప్రతినిధులకు పనులు పూర్తి చేయాల్సిన ఆవశ్యకతపై సూచనలు, సలహాలిచ్చారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు ఓటర్లకు ఓటు ప్రాధాన్యంపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామ సంఘాలతో స్వీప్ కార్యక్రమంలో భాగంగా ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీడీవో ఎంఏ అలీం, సమాఖ్య ప్రతినిధులున్నారు.

కార్పొరేట్ సంస్థలకు అనుమతివ్వొద్దు

గోదావరిఖని: తమ వృత్తికి భంగం కలిగేలా కార్పొరేట్స్థాయి షాపును ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ సోమవారం ఎన్టీపీసీ నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్ఠాకూర్కు వినతి పత్రం అందజేశారు.

జ్యోతినగర్: కార్పొరేట్ విధానంతో వస్తున్న వారిని కట్టడి చేసి క్షౌర వృత్తిదారుల కుటుంబాలను రక్షించాలని తెలంగాణ నాయీబ్రాహ్మణ సేవాసంఘం ఎన్టీపీసీ పట్టణ అధ్యక్షుడు సదానందం, ప్రధాన కార్యదర్శి విజయ్కుమార్ ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ ఎస్సై ఉదయ్కిరణ్కు వినతి పత్రం అందించారు.

మొక్కలను సంరక్షించాలి

రామగుండం: ప్రస్తుతం గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్న తరుణంలో గ్రామాల్లోని నర్సరీల్లో మొక్కల సంరక్షణపై పలు జాగ్రత్తలు పాటించాలని సంబంధిత నర్సరీల వనసేవక్లను అంతర్గాం ఎంపీడీవో ఎంఏ అలీం ఆదేశించారు. సోమవారం ఎల్లంపల్లి గ్రామ నర్సరీని సందర్శించారు.

తాగునీటి ఇబ్బందులు రానివ్వం

పెద్దపల్లిరూరల్: మండలంలోని గ్రామాల ప్రజలకు ఎండాకాలంలో తాగునీటి ఇబ్బందులు రాకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని మండల పరిషత్ అధికారి సుదర్శన అన్నారు. బొంపల్లి, దేవునిపల్లిలో సోమవారం తాగునీటి బావులను పరిశీలించారు.

విద్యుత్ పొదుపు.. ఉత్పత్తితో సమానం

రామగుండం: వినియోగదారులు విద్యుత్ను పొదుపు చేయడమంటే విద్యుత్ను ఉత్పత్తి చేసినట్లేనని, తక్కువ విద్యుత్ వినియోగంతో నడిచే ఉపకరణాలను వినియోగించడంతో విద్యుత్ను ఆదా చేయొచ్చని పెద్దపల్లి జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ బొంకూరి సుదర్శనం అన్నారు. సోమవారం రామగుండం పట్టణంలోని ఎన్పీడీసీఎల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విద్యుత్ భద్రతా వారోత్సవాల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యుత్ భద్రత వారోత్సవాల పోస్టర్ను ఆవిష్కరించి విద్యుత్ పొదుపు చర్యలు పాటించడంపై ప్రతిజ్ఞ చేయించారు. డివిజనల్ ఇంజనీర్(మంథని) ఈశ్వరప్రసాద్, ఏడీఈ రాజ్కుమార్, సబ్ డివిజనల్ ఏఈలు వంశీకృష్ణ, ఆరెపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

108 వాహనంలో ప్రసవం

ధర్మారం: నందిమేడారంకు చెందిన సంధ్య(26)ను పురిటి నొప్పులతో పెద్దపల్లి మాతాశిశు ఆరోగ్య కేంద్రానికి తరలిస్తుండగా.. మార్గమధ్యలోనే ఈఆర్సీపీ వైద్యుల సలహా మేరకు అంబులెన్స్ సిబ్బంది ప్రసవం చేసి తల్లీబిడ్డను కాపాడారు. సంధ్య పురిటి నొప్పులతో బాధపడుతోందని సోమవారం తెల్లవారుజామున 108కు ఫోన్ చేశారు. సిబ్బంది వెంటనే చేరుకొని పెద్దపల్లి మాతాశిశు ఆరోగ్య కేంద్రానికి తరలిస్తుండగా.. పురిటి నొప్పులు అధికమవడంతో అంబులెన్స్లోనే ప్రసవం చేశారు.

మహాసభలను విజయవంతం చేయాలి

ఫెర్టిలైజర్సిటీ: 39వ డివిజన్ మాతంగికాలనీలోని ఆర్ఆర్ గార్డెన్స్లో మంగళవారం ఆటో కార్మికుల హక్కుల సాధన కోసం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆటో జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవీందర్ పిలుపునిచ్చారు.

కాల్వశ్రీరాంపూర్ మండలవాసికి డాక్టరేట్

కాల్వశ్రీరాంపూర్: మీర్జంపేట గ్రామానికి చెందిన ఉయ్యాల బాలకృష్ణకు గౌరవ డాక్టరేట్ వరించింది. బాలకృష్ణ ఇబ్రహీంపట్నంలోని గురునానక్ విద్యా సంస్థల్లో ఫార్మసి విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్గా పని చేస్తున్నాడు. పరిశోధక విద్యార్థిగా ఫైటో కెమికల్స్ పరిశోధన ఎంపిక చేయబడిన ఔషధ మొక్కల నుంచి మానసిక ఒత్తిడి తగ్గించేందుకు శక్తి నిర్ధారణ అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను బాలకృష్ణకు అన్నామలై యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ అవార్డును ప్రకటించింది.

కాంగ్రెస్లో చేరికలు



కాంగ్రెస్లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఎలిగేడు: ఓదెల మండలం నుంచి మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు భారీ సంఖ్యలో సోమవారం ఎలిగేడు మండలం శివపల్లిలో పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఓదెల మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు ఆకుల మహేందర్, రాజర్ల రాజేశం(మాజీ ఉప సర్పంచ్), వార్డు మాజీ సభ్యులు వంగ రాజమల్లు, నర్సింగం, ముదిరాజ్ సంఘం నాయకులు పిట్టల రామచంద్రం, మంద కృష్ణమూర్తి, తుడి రాజయ్య ప్రవీణ్తోపాటు కానుగంటి శంకరయ్య, మ్యాడగోని సంతోష్గౌడ్, అల్లం అజ్జీర్, బోడగుంట శివయ్య, రవికంటి ప్రభాకర్, వారి అనుచరులు కాంగ్రెస్లో చేరారు. ఓదెల గౌడ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్గౌడ్, ఉపాధ్యక్షుడు శంకరయ్యగౌడ్, మార్క సదానందం, నాగపూరి రవికుమార్, శ్రీనివాస్, భూసారపు కనకయ్య, పడాల మల్లయ్య, ఓదెల ముదిరాజ్ సంఘం మాజీ అధ్యక్షుడు సదానందం, ఓదెలు, స్వామి, శంకరయ్య, తిరుపతి, అంజి, దస్తగిరి, నూతి సత్యనారాయణ, పలువురు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ఎల్లంపల్లి గ్రామ తాజా మాజీ పంచాయతీ పాలకవర్గం కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు గుమ్ముల శ్రీకాంత్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా.. వారికి రామగుండం ఎమ్మెల్యే మక్కాన్సింగ్ఠాకూర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తాజా మాజీ సర్పంచ్ గుమ్ముల రవీందర్, తాజా మాజీ ఉప సర్పంచ్ కూనారపు గోపీకృష్ణ, బీజేపీ అధ్యక్షుడు గోలివాడ సాయి, గంగపుత్ర సంఘం గ్రామ శాఖ అధ్యక్షుడు ధర్మాజీ ఐలయ్య, పాలకవర్గ సభ్యులు బోరె చందు, అభినయ్, అఖిలాష్, ఉదయ్కిరణ్, నరేష్, మహేశ్, రాకేశ్, తోకల రాకేశ్ తదితరులు చేరారు.

ముత్తారం: పోతారంకు చెందిన మాజీ ఎంపీటీసీ చెలుకల లింగాభవానిసుధీర్ సోమవారం రాత్రి ధన్వడలో మంత్రి శ్రీధర్బాబు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. దొడ్డ బాలాజీ, సదానందం, నాగినేని జగన్మోహన్రావు, మేకల ఓదెలు ఉన్నారు.

గోదావరిఖని: బీఎస్పీ రాష్ట్ర నాయకుడు దేవునూరి సంపత్కుమార్ సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రామగుండం: మనస్తాపానికి గురైన వ్యక్తి 4రోజుల క్రితం పురుగుల మందు తాగగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. అంతర్గాం ఎస్సై వెంకట్ వివరాల ప్రకారం.. అంతర్గాం మండల పరిధిలోని గోలివాడకు చెందిన ఆవుల మనోహర్(52) కూలి పని చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. ఇతడి మొదటి భార్య వెంకటలక్ష్మి అనారోగ్యంతో కొన్నేళ్ల క్రితం మృతిచెందింది. మొదటి భార్యకు ఇద్దరు కుమార్తెలు వివాహితులు. 2020లో మందమర్రికి చెందిన లావణ్య అనే మహిళను రెండో వివాహం చేసుకున్నాడు. గతేడాది భార్యాభర్తల మధ్య ఘర్షణ తలెత్తగా.. ఇంటి నుంచి వెళ్లిపోయి ఇప్పటికీ తిరిగిరాలేదు. జీవితంపై విరక్తి చెంది మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకుంటానంటూ కూతుళ్లతో ఆవేదన వెళ్లగక్కేవాడు. కాసిపేటలో ఉండే కుమార్తె ఆకాంక్ష తండ్రికి అపుడపుడు ఫోన్ చేసేది. 4రోజుల క్రితం ఫోన్ చేయగా.. ఇప్పుడే గడ్డి మందు తాగానని రోదిస్తూ తెలిపాడు. అంతర్గాంలో ఉండే మరో సోదరి ప్రవళికకు ఫోన్ చేసి నాన్న ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలియజేయగా.. గోలివాడకు వెళ్లి తండ్రి పరిస్థితి చూసి గోదావరిఖని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్, అక్కడి నుంచి హైదరాబాద్ ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా సోమవారం మృతిచెందాడు. ఆకాంక్ష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పోటాపోటీ ప్రచారం

ధర్మారం: పెద్దపల్లి పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని ఆ పార్టీ నాయకులు, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ను గెలిపించాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు సోమవారం ప్రచారం చేశారు. ఉదయం, సాయంత్రం ఇరు పార్టీల నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహిస్తూనే ఉపాధిహామీ కూలీలు పనులు చేస్తున్న ప్రాంతాలకు వెళ్లి ప్రచారం చేస్తున్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

పెద్దపల్లిరూరల్: చిన్నబొంకూర్లో ట్రాక్టర్ బోల్తా పడ్డ ఘటనలో మృతిచెందిన మహిళా కూలీల కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని సీపీఎం పెద్దపల్లి ఏరియా కార్యదర్శి సీపెల్లి రవీందర్ కోరారు. రూ.15లక్షల పరిహారమందించాలని కోరారు. చికిత్స పొందుతున్న వారికి మెరుగైన వైద్యాన్ని ఉచితంగా అందించాలన్నారు.

ఆర్థిక సాయం

సుల్తానాబాద్: పట్టణంలోని శాస్త్రినగర్కు చెందిన బొంకూరి మునిందర్ అనారోగ్యంతో మరణించగా.. దహన సంస్కారాలకు రూ.10వేల ఆర్థిక సాయాన్ని చైర్పర్సన్ గాజుల లక్ష్మి అందజేశారు.

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రానికి చెందిన భూమయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఇదే గ్రామానికి చెందిన పవన్ అనే బాలుడు అనారోగ్యానికి గురి కావడంతో వైద్య ఖర్చుల కోసం రూ.10వేల చొప్పున ఇరు కుటుంబాలకు ఎమ్మెల్యే విజయరమణారావు పంపించగా.. మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్ అందించారు.